# ౨ పెద్దూరు

పిట్టకబుర్లు చెప్పడంలో ఫస్టు కొండుభట్టు. ఉన్నవో కొన్ని,
లేనివో కొన్ని, తనకు తెలిసినవో కొన్ని, తెలియనివో కొన్ని పేర్లు
మార్చి కథల మాదిరిగా కల్పించి, వినేవారికి విసుగులేకుండా చెబుతాడు.
'వాకలగరువు' వుంటే 'పోకలపాలెం' అనీ. 'పేరూరు' వుంటే 'పెద్దూరు'
అనీ 'అమలాపురం' ఉంటే 'నిర్మలాపురం' అనీ 'రామయ్య' అయితే
'వెంకయ్య' అనీ 'శ్రీరంగపట్నం' వుంటే 'శంకరగిరిమన్యం'అనీ ఇలాగ్గా
మార్చి నవారల్లి నట్లల్లుతాడు — ఎంత చిత్రంగా వన్నా — ఓనాడు
చెప్పేడతడు.

"నిర్మలాపురం మునసబుకోర్టులో పూర్వం నర్సయ్యశర్మ అనే
అమీనాగారుండేవారలు. ఇక్ష్వాకుల కాలమ్మాట. ఆ రోజుల్లో బ్రాహ్మ
ణులే చాలామంది అమీనాలుగా వుండేవారట, — జప్తులు చేసినా, ఋణ
స్థుల్ని పట్టుకున్నా, ఏలాలు వేసినా వారేనట. అమీనా హోదా అంటే
మునసబుగారి తరువాత హోదాగా ఉండేదట. అలా మునసబుగారు జప్తు
ఆర్డరువేస్తే మధ్య నాజరుగారి ప్రేక్ష్యంలేకుండా అమీనాగారు తిన్నగా
ఆ ఆర్డరే తీసికొని అమలుజరుపుతూ వచ్చే రివాజట.

ఆ కాలంలో ఆ కోర్టు మునసబుగారుకూడా వాళ్ళకు తగ్గ ఆయనే
దొరికేడు. ఆయన సంస్కృతమంటే చెవి కోసుకొనే రకం. పురాణం

వినడం అంటూ వస్తే భోజనమన్నాసరే, కోర్టుపని అయినాసరే, మానే సేసి, ఇవాళ కోర్టు మర్తరపు, అని ఎక్కడపడితే అక్కడ పురాణంలో లీనం అయిపోయే మనిషి. సాక్షి బోనులో కెక్కితే వాని వరసచూచి శాస్త్రుల్లుగారైనా యొక్క శ్లోకమైనా చదివించకుండా వెళ్ళనీయడు. కొండొకచో సాక్షి వాఙ్మూలాల్లోకి అనాయాసంగా శ్లోకాలు కూడా దొర్లుకు పోతూనే వుండేవి అనీ, అవి అప్పీలు కోర్టువారు బ్రాకెట్లల్లో పడేసి మిగతా వాఙ్మూలమే చదివేవారనీ హైకోర్టు ప్లీడర్లు చెప్పేవారు.

మన వెంకయ్యగారు కోర్టు ఆవరణలో ప్రవేశించి యెక్కడన్నా ఆయన వియ్యంకుడుగారైన అమీనాగారు నరసయ్యశర్మగారు అగపిస్తా రేమో అని నెమకి చూచి, కానక, ఇప్పటినుంచీ పోకలపాలెంవెళ్ళి మాత్రం చేసేదేమిటి ఇక్కడే ఈ బ్రాహ్మణ్యంతో కాస్సేపు ముచ్చటిద్దా మని రావిచెట్టుక్రింద ఓరసిలగ కూర్చున్నారు.

కూర్చుని ఆలా రావిచెట్టుకేసి చూస్తూంటే ఆయన పురాణభక్తుడు కాబట్టి ఆ రావిచెట్టే పొన్నచెట్టు అయిపోయి ఆ కృష్ణమూర్తి గోచరించి ఆయనచేత మొదట్లో అస్పష్టంగా "రాధే గోవిందకృష్ణ" "రాధే గోపాల కృష్ణ" లోలో అనిపించినాడు. క్రమంగా అది లోపల పట్టలేక పైకి పాడుతూ గంతులేసినారు. ఎవరు ? శంకరగిరి మన్యంలోనుంచి వచ్చిన వెంకయ్యగారు. ఆ గంతులకు చుట్టూవున్న బ్రాహ్మణ్యం చేరి వెంకయ్య గార్ని ఎరక్కపోయినా మహాభక్తునిగా గుర్తించి చుట్టూ కూర్చుండి చూచేరు. చూస్తూవుండేలోపలే, వెంకయ్యగారు వ్యాసప్రోక్త భాగవతము లోని రాసక్రీడఘట్టము కంఠోపాఠంగా ఒప్పజెప్పుచూ ఫెళ్లన ప్రత్యక్ష శయ్య నర్థము సెబుతూ తాండవమాడిపొయ్యేరు. బ్రాహ్మలందరూ

తమర్ని తొమ్మలిచి ఆయనచుట్టూ కూర్చున్నవాళ్ళల్లా నిలుచుండి గోపి కల్లాగ తిరగడం మొదలుపెట్టినారు.

లోపల్నుంచి కోర్టువారు విని "ఏమిటోయి గల్లంతు ? ఎవరోయి అమీనాలు అక్కడ ? ఆ గల్లంతుచేసే మనిషిని ఇలా లాక్కురండి" అన్నారు. అక్కడప్పుడున్న అమీనాల్లో ఉన్నాయన సర్మగారే. అప్పుడే యేదో వేలం, అక్కడే పాటదార్ల చేత సంతకాలుచేయిస్తూ పూర్తిచేసినారు. కోర్టువారి మాటవిని వెంటనే తన చేతిలోని కాగితాలు మడతపెట్టి వారంటు ఇలాకా గుమాస్తాకిచ్చి, తాను "ఎవరా గల్లంతు ?" అంటూ యీవలకు వచ్చేసరికి, బ్రాహ్మణ్యమంతా తమ కొంప మునిగిందనుకొని పారిపోయినారు. వెంకయ్యగారు మట్టుకు 'రాధే గోవిందకృష్ణ. రాధే గోపాలకృష్ణ' అని స్మరించుకుంటూ అక్కడే వుండిపోయినారు. ఆయన్ని అమీనాగారు, మన శర్మగారు, రెక్కదొరగ బుచ్చుకొని 'రాండి : కోర్టు వారు పిలుస్తున్నారు !' అన్నారు. శర్మగార్ని వెంకయ్యగారు వెంకయ్య గార్ని శర్మగారు పోల్చుకున్నారు. సంబంధీకులుగా గ్రహించుకున్నారు. కాని అలాంటి పరిస్థితుల్లో ఏమీ పైకనుకోవడం బాగుండదనో ఏమో కేవలం లాతివాళ్ళలాగే ప్రవర్తించేరు.

శర్మగారు వెంకయ్యగారి రెక్కపట్టుకొని లోపలకు తీసుకు వెళ్ళే సరికి కోర్టువారు దిగ్గునలేచి 'ఇలా దయచెయ్యండి' అని ఆయన సరసనే యొక కుర్చీవేయించి కూర్చోమన్నారు. కోర్టులో వున్నవారంతా నివ్వెర పడిపోయేరు. 'కోర్టు మర్తరపు' అన్నారు మునసబుగారు. తరువాత వెంకయ్యగారి దిక్కుమొగంబై "మీకు పండితులనితోచి తీసుకురమ్మన్నాను అంతే. పరాయి వారనికాదు. మీరక్కడ 'రాధేగోపాలకృష్ణ' అని అంటూంటే నాకిక్కడ కలంనడవక ఆగిపోయింది వినబడి. ఈ రాత్రి

మీరు నాయింటినుండిపోయి పురాణంచెప్పాలి" అన్నారు. "తమసెలవైతే ఇంతకంటేనా !" అన్నారు వెంకయ్యగారు. "ఎక్కడికి వెళ్ళాలిమీరు !" అన్నారు మునసబుగారు. అప్పుడు వెంకయ్యగారు శర్మగారికేసి చూచి "వీరమ్మాయిని మా అబ్బాయి కిచ్చారు. కోడల్ని శ్రావణశుక్రవారం నోముగ్గాను, తీసుకొని వెడదామనివచ్చే" నన్నారు వెంకయ్యగారు. 'ఓ మాశర్మగారి వియ్యంకుడుగారా ? మీరు? శర్మా ! మీయింటికి రేపువుదయం మా మేనాలో మీ వియ్యంకుడుగార్ని వారికేలోపం లేకుండా పంపించివేస్తూ వున్నాను. నీవువెళ్లు. నీపనిచూచుకో' అన్నారు.

ఆరోజుల్లో ఉద్యోగస్థులు ఎక్కడకు వెళ్ళడం వచ్చినా మేనాల మీదనే వెళ్ళేవారు. కోర్టుకు రావడం మేనా మీదవచ్చి మన మునసబు గారు దేహపరిశ్రమకాస్త వుండాలంటూ ఇంటికి వెళ్ళేటప్పుడు నడచి వెళ్ళేవారు. కాని మేనా గుమ్మంలో ఎప్పుడూ అరుగుమీద వుండేది. బోయీలు వాకిట్లో నిరంతరం వుండేవారు పొద్దుగూకిపోయేదాకా. ఆకారణంగా ఇంటికి వెళ్ళీ వెళ్ళడంతోటే పై సంభాషణమైనాక. మునసబుగారు చాకలివాళ్ళను రాత్రి తమయింటివద్దే పరుండమనీ తూర్పు తెల్లాతేలో వెంకయ్యగార్ని శర్మగారింట దిగబెట్టవలసిందనీ హుకుంజారీ చేసినారు.

మునసబుగారు వెంకయ్యగార్కి షడ్రసోపేతంగా గుడువ విందుబెట్టి తివాసీ పఱిపించి పెద్దసభ గావించి వెంకయ్యగారి చేత అష్టాదశ పురాణాల్లోని సంగతులు వచ్చేటట్టుగా తెల్లవార్లు చెప్పించేరు. తెల్లవాఱుతూందనగానే "వెంకయ్యగారూ తమరీ మేనాలో దయచేసి మీ వియ్యంకుడుగారింటికి వెళ్ళవలసిందని నా ప్రార్థన" అన్నారు మునసబుగారు. మునసబుగారు స్వయంగా "ఓ వీరిగా ! పేరిగా ! ఓ పుల్లిగా !" అనిచాకలి వాళ్ళను కేకేసి "ఎత్తండి మేనా ఎత్తండి" అని అన్నారు.

వెంకయ్యగారు "ఎందుకండీ మేనా గీనా ?" అన్నాగాని మునసబుగారు "పల్లకి తన కేలపట్టి యెత్తె" నన్నట్లు తాంకూతా చేయేసి సాగనంపినారు. ఉద్దండుడు వెంకయ్యగారు ! ఏం ప్రజ్ఞ ! అనుకుంటూ లోపలికి వెళ్ళి పోయినారు.

ఇక శర్మగారైనా 'మీరు వెళ్ళండి' అని మునసబుగారన్న పాళంగా అక్కడ వుంటే ఏంచిక్కో అని తిన్నగా పెద్దూరు మీదుగా పోకలపాలెం దారిపట్టేరు. అప్పుడు పెద్దూరు బ్రాహ్మణ్యం అంతా ఆయన చుట్టూ మూగి "బాబూ మేమక్కడుంటే మమ్మల్నందర్నీ మీరు నిన్న కొట్లోకి తోసేసేవారే !" అన్నారు. శర్మగారు నవ్వుతూ "ఎంత వెఱ్ఱిబ్రాహ్మణ్యం అయ్యా మనది ! ఆయన మా వియ్యంకుడుగారు మా రెండో అమ్మాయి పెళ్ళికి చూచే వుంటారు. మఱచి పోయినారేమోగాని. ఆయన్ని మునసబుగారు — కోర్టుమునసబుగారు మర్యాదచేసి తమ ప్రక్కన కూర్చో పెట్టుకున్నారు గాని, కొట్లో పెట్టించలేదు. ఈ రాత్రి వారింట పురాణం చెప్పి రేపుదయం మీ ఊరిమీదుగా వారి మేనాలో వచ్చేరు" అని మెహర్బాణీగా ఆదేసివెళ్ళిపోయినాడు.

పెద్దూరి బ్రాహ్మణ్యం అక్కడ ఆ పెద్దూర్లో—ఇక్కడ మునసబు గారింట్లో వెంకయ్యగారు పురాణం చెప్పుతూ వుంటే అక్కడ ఆ పెద్దూర్లో ఆ బ్రాహ్మణం ఓసభ చేసినారు ఆ రాత్రి. "మన వూరిమీదుగా ఇదివఱ కుద్యోగస్థుల మేనాలు ఎప్పుడూ వెళ్ళలేదు. రేపొద్దున మునసబుగారి మేనా యిలా వెడుతుందట, ఆయన్నెవర్నో తీసికొని (అహంభావములో ఆ బ్రాహ్మణుల కప్పుడు అంత క్రితం వాళ్ళను గంతులు వేయించిన వెంకయ్యగారు ఎవరో అయిపోయినారు) వెడుతుందట ! మనమంతా అడ్డుతగలాలి. కట్టలుచ్చుకు ఎవరి గుమ్మంలో వాళ్ళం నిలుచుని

వున్నట్టుగా నించోని ఆసవారీ చెక్కలు విఱిగేటట్టు చితగ్గొడదాం'' అని తీర్మానించుకున్నారు.

శర్మగారి కదేం తెలీదు. వెంకయ్యగారి కంతకంటే తెలీదు. వెంకయ్యగారు తెల్లవారడంతోనే పూర్వోక్త ప్రకారంగా మేనా ఎక్కి చాకలివాండ్రు 'ఓంబాయి' అని మామూలు ప్రకారం కేకలు వేసికొంటూ మోసికొనిరా, వూగుతూ వున్నారు. ఇంటిదగ్గఱ శర్మగారు వియ్యంకుడు గారొస్తారని మర్యాదగా చాపా అదీ వేసి కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళూ అంగోస్త్రం పెట్టి ఎదురు చూస్తూవున్నారు.

కొంత దూరం వెళ్ళిన తరువాత పెద్దూరుగుండా మేనా వచ్చే సమయానికి చాకలివాళ్ళు చూచేరు పెద్దూరు బ్రాహ్మణ్యం కఱ్ఱలేసుకు గుమ్మాల్లో నిలబడ్డం. సవారి దింపితే తమకీ, మేనాలో కూర్చున్నవారికీ, మునసబుగారికీ కూడా నామోషే. దింపకపోతే సవారీ పగలగలదు. వాళ్ళ బుఱ్ఱలున్నూ — వాళ్ళకేం తట్టిందో తత్క్షణం చాకలివాళ్ళంతా మామోలుకేక మానేసేసి "ఉద్యోగస్థుల మేనా కాదిది ఓంభాయి ఓం! విద్యావంతుల మేనా అంహోయి ఓంభాయిఓం!'' అంటూ మోసుకెళ్ళేరు, ఊరావలికంటా, ఎక్కడున్న బ్రాహ్మణులక్కడ ఎత్తినకఱ్ఱలలా వాలుగా వుంచేసేరు, విద్యావంతుల మేనా అనేసరికి. అప్పుడాకఱ్ఱలు ఆ మేనా మీద ఎలా వున్నాయి అంటే బాలభటులు కఱ్ఱలు కనక మర్యాదకోసం బాలభటనాయకుని నెత్తి మీదకు పట్టినట్టు 'ఆర్చి' కట్టి గౌరవం సూచించినాయి.

లోపలున్న వెంకయ్యగారు ఆ కేకమార్పు తెలిసికొని తరువాత ఆ చాకలివాళ్ళ తెలివికి నిర్ఘాంతపోయి "ఎవరు చెప్పేరఱ్ఱా ? మీకు నేను

విద్యావంతుణ్ణో" అని అడిగేరు. "ఎవరు సొప్పాలిబాబూ ! మా బ్రతుకు దెరువు చెప్పిం" దన్నారు. అలా అనకపోతే మా బుర్రలు పగిలి పోవడమే అయియుండేదీపాటికావూళ్ళో" అన్నారు.

"విద్యావంతులు అంటే ఆ గ్రామంలో అంతగౌరవమున్న. ఉద్యోగస్థులంటే అంత ఆతతాయితనమూనా ! ఏవూరు అవి !" అని అడిగేరు వెంకయ్యగారు. "పెద్దూరు" అన్నారు శర్మగారు ఎదురొస్తూ.

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 24-11-1932 | కోనసీమ | 'వినోదిని'లో |